క్లుప్తంగా

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ డ్రైవర్ మృతి

రాజంపేట : మన్నూరు సర్కిల్ పరిధిలోని ఊటుకూరు చెరువు సమీపంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ డ్రైవర్ ధన్నాసి జనార్దన్ మృతి చెందాడు. శనివారం రాత్రి పోలీసులు ఈ ప్రమాదంపై కేసు నమోదు చేశారు. ఊటుకూరు చెరువు నుంచి జాగువారిపల్లెకు ట్రాక్టర్‌లో మట్టి తరలిస్తుండగా, అదుపుతప్పి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

గుర్తు తెలియని వృద్ధురాలు..

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం వద్ద గల సత్రంలో ఆదివారం గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. మైదుకూరు వైపు వెళ్లే దారిలో గల సత్రంలో వృద్ధురాలు మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఆమె గురించిన వివరాలు తెలియకపోవడంతో పంచాయతీ అధికారులకు అప్పగించి అంత్యక్రియలు నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఆవు ..

నుండుపల్లె : విద్యుత్ షాక్‌కు గురై ఆవు మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. గ్రామస్తుల వివరాల మేరకు.. మండల పరిధిలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీలోని బూడిదేటిపల్లెలో శివయ్య అనే రైతుకు సంబంధించిన జెర్సీ ఆవు రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తూ అక్కడున్న ఎర్త్ కనెక్షన్‌కు తగులుకొని మృతి చెందిందని స్థానికులు తెలిపారు. ఆవు తొమ్మిది నెలల గర్భంతో ఉన్నట్లు రైతు శివయ్య తెలిపారు. రోడ్డు పక్కన నిర్మించిన ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

మదనపల్లె సిటీ : రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడిన సంఘటన ఆదివారం కురబలకోట మండలం చేనేతనగర్ వద్ద జరిగింది. తెట్టు గ్రామానికి చెందిన అఖిల్(21), విష్ణు (20) ద్విచక్ర వాహనంలో మదనపల్లె వైపు వస్తుండగా మదనపల్లె నుంచి ఆర్‌సి కురపల్లికి చెందిన రామమూర్తి(65) మరో ద్విచక్రవాహనంలో వెళుతుండగా వాహనాలు ఢీ కొనడంతో గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అలాగే అంగళ్లు విశ్వం కాలేజీ వద్ద గొల్లపల్లె పంచాయతీ చీకిచెట్టిపల్లెకు చెందిన మౌలా కుమారుడు రోషన్‌జమీర్(19) ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఎదురుగా వచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. గాయపడిన రోషన్ జమీర్‌ను స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- నేటి నుంచి ఏపీ ఈఏపీ సెట్
- ఏర్పాట్లను సిద్ధం చేసిన అధికారులు
- 19, 20న అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు
- 21 నుంచి 27 వరకు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు


పరీక్ష కోసం సిద్ధం చేసిన కంప్యూటర్ ల్యాబ్

కడప ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ పరీక్ష(ఏపీఈఏపీసెట్)– 2025 నేటి నుంచి ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానుంది. ఈ పరీక్షలను కంప్యూటర్ ఆధారిత(ఆన్‌లైన్) విధానంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ(బైపీసీ) కోర్సుల ప్రవేశ పరీక్షలు జరగనుండగా, ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఇంజినీరింగ్ కోర్సుల ప్రవేశ పరీక్షలు జరగనున్నాయి. ఇందులో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌లో పరీక్షలు జరగనున్నాయి. ఇందులో ఉదయం సెషన్ 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు, అలాగే మధ్యాహ్న సెషన్ 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు.

రెండు సెషన్స్‌లో పరీక్ష..

ఉదయం సెషన్‌కు సంబంధించి 7.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం పరీక్షకు 12.30 గంటల నుంచి 2 గంటల వరకు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. ఉదయం 9 గంటలు, మధ్యాహ్నం 2 గంటల తరువాత నిమిషం ఆలస్యమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. పరీక్ష జరిగే రోజు కనీసం గంట ముందుగా కేంద్రానికి చేరుకోవాలి. కేంద్రాల దగ్గర తనిఖీలతోపాటు బయోమెట్రిక్ హాజరు నమోదు, సంతకం చేయాల్సి ఉన్నందున చివరి నిమిషంలో హడావుడి పడకుండా చూసుకోవాలి.

విద్యార్థులు వెంట తీసుకురావాల్సిన వస్తువులు..

- విద్యార్థులు ఆన్‌లైన్‌లో దాఖలు చేసిన ఏపీ ఈఏపీసెట్ –2025 దరఖాస్తు ప్రింటవుట్ కాపీతో పొందుపర్చిన నిర్ణీత బాక్స్‌లో విద్యార్థి కలర్ పాస్‌పోర్టు సైజ్ ఫొటోను అతికించి సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌తో సంతకం చేయించుకోవాలి.
- పరీక్ష జరిగే జరిగే రోజున సదరు ప్రింటవుట్ కాపీతోపాటు హాల్ టికెట్ వెంట తీసుకుని వెళ్లాలి. బ్లూ, బ్లాక్ కలర్ బాల్ పాయింట్ పెన్ను అనుమతిస్తారు. గుర్తింపు కోసం ఇంటర్ హాల్ టికెట్, పాస్‌పోర్టు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీలలో ఏదో ఒకటి ఒరిజినల్ తీసుకుని వెళ్లాలి. ఇవి మినహా ఇతర ఏ వస్తువులు అనుమతించరు.
- విద్యార్థి ఫొటో అతికించిన ఆన్‌లైన్ దరఖాస్తు కాపీ పై పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్ సమక్షంలో సంతకం చేసి ఎడమ చేతి బొటనవేలి ముద్ర వేయాలి.

తమ్ముడి చావుకి కారణమయ్యారని..

- అన్నా వదినలపై కోడి కత్తులతో దాడి.
- హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

నిమ్మనపల్లె : తమ్ముడి చావుకు కారణమయ్యారని కక్ష పెంచుకొని అన్నా వదినలపై కోడి కత్తులతో విచక్షణారహితంగా దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ఎస్ఐ తిప్పేస్వామి ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు.

చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం దిగువపల్లె పంచాయతీ యానాది పాలెంకు చెందిన ఎర్రప్ప (30), శ్యామల అలియాస్ చిన్న బుజ్జి (24) దంపతులు. వీరు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఎరప్పకు హనుమంతు, అక్కులప్ప ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. ఏడాది క్రితం చిన్న తమ్ముడైన అక్కులప్ప వదిన శ్యామలతో వివాహేతర సంబంధం కలిగి ఉండడంతో, విషయం తెలుసుకున్న ఎర్రప్ప నిలదీశాడు. దీంతో మనస్తాపానికి గురైన అక్కులప్ప ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటినుంచి మరో తమ్ముడైన హనుమంతు అన్నా వదినల కారణంగానే తన తమ్ముడు అక్కులప్ప మృతి చెందాడని భావించి వ్యక్తిగతంగా వారిపై కక్ష పెంచుకున్నాడు. వారిని చంపడానికి అవకాశం కోసం ఎదురు చూశాడు. ఈ క్రమంలో ఎర్రప్ప, శ్యామల నిమ్మనపల్లి మండలం బండ్లపై పంచాయతీ దుర్గంవారిపల్లె వద్ద పొలం పనులు చేసుకుంటూ, అక్కడే ఉంటున్నారన్న విషయం తెలుసుకున్నాడు. యానాదిపాలెంకు చెందిన స్నేహితుడు అశోక్ (22), కర్ణాటక వాసి ప్రస్తుతం యానాది పాలెంలో ఉంటున్న శివానంద్ అడివప్ప (24) సాయం కోరాడు. ఈనెల 16న శుక్రవారం సాయంత్రం ముగ్గురు కలిసి పథకం ప్రకారం కోడి కత్తులు తీసుకొని ద్విచక్ర వాహనంలో వచ్చి దుర్గంవారిపల్లె సమీపంలోని గుంటి వద్ద కాపు కాశారు. భార్య శ్యామలతో కలసి ఎర్రప్ప దుర్గం వారికి పల్లెకు వెళుతుండగా అడ్డుకున్నారు. తమ వెంట తెచ్చుకున్న కోడి కత్తులతో హనుమంతు, అశోక్, శివానంద్ వారిపై దాడి చేసి విచక్షణారహితంగా పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డారు. దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులను స్థానికులు మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. శ్యామల తండ్రి పాపన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితులను ఆదివారం మండలంలోని పిట్టవాండ్లపల్లె క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. రిమాండ్ నిమిత్తం నిందితులను కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

పాఠశాలల్లో సమాంతర మీడియం కొనసాగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

మదనపల్లె సిటీ : పిల్లలకు స్వేచ్ఛనిచ్చి ఇష్టం వచ్చిన మీడియంను ఎంచుకునే విధంగా పాఠశాలల్లో తెలుగు మీడియంను ఇంగ్లీషు మీడియంకు సమాంతరంగా పునః ప్రారంభించడం లేదా కొనసాగించడం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45 దాటితే రెండవ సెక్షన్‌కు అనుమతించాలన్నారు. ఈనెల 21వతేదీన పాత జిల్లా కేంద్రంలో జరగబోయే డీఈఓ కార్యాలయ ముట్టడి కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శులు పురం రమణ, ఆదినారాయణ, నాయకులు విజయకుమార్, సుధాకర్, రవిప్రకాష్, మురళి, అజంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడి ఘటనలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై కేసు నమోదు

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లికు చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ నసీరుద్దీన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్రబాబు ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. నసీరుద్దీన్ పట్టణ పరిధిలోని ఫీల్డ్‌లో ఉపాధి పనులు చేయిస్తుండగా ఓ పత్రికలో పనిచేస్తున్న విలేకరి రాజశేఖర్ కూలీల దగ్గరకు వెళ్లి పనులపై ఆరా తీశారు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం లక్కిరెడ్డిపల్లి మూడు రోడ్ల కూడలిలో ఉన్న విలేకరిని కులంపేరుతో దూషించి దాడికి యత్నించినట్లు తెలిపారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నకిలీ బంగారంతో మోసం

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ బస్టాండు వద్ద కూరగాయల వ్యాపారం చేసుకొని జీవిస్తున్న అన్నపూర్ణమ్మకు గుర్తుతెలియని వ్యక్తులు నకిలీ బంగారు ఇచ్చి ఆమె వద్ద రూ.5లక్షలు తీసుకెళ్లి మోసం చేసినట్లుగా అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఈ విషయాన్ని ఆదివారం సీఐ రాజా తెలిపారు. వివరాల్లోకి వెళితే.. 2024 డిసెంబర్‌లో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు(ఇందులో ఒకరు మహిళ) అన్నపూర్ణమ్మ వద్దకు వచ్చి తమ వద్ద రూ.5లక్షల విలువ చేసే బంగారు ఉందని చెప్పి, బంగారు పరీక్షించుకున్నారు. గుర్తుతెలియని వ్యక్తుల వద్ద బంగారు తీసుకుంటే లేనిపోని సమస్యలు వస్తాయని అన్నపూర్ణమ్మ వెనకడుగు వేశారు. అయితే వారు ఇప్పుడు తీసుకోకపోయినా పర్వాలేదు, మా ఫోన్‌నెంబరు ఇస్తాము ఆ తర్వాత అయినా ఫోన్ చేస్తే వచ్చి ఇస్తామని వివరించారు. కొన్ని రోజుల తర్వాత మళ్లీ వచ్చి డబ్బు అవసరముందని, బంగారు తీసుకోవాలని మాయమాటలు చెప్పి నమ్మించారు. దీంతో అన్నపూర్ణమ్మ దంపతులు రూ.5లక్షలు నగదు ఇచ్చి, మోసగాళ్ల నుంచి బంగారు తీసుకున్నారు. ఆ తర్వాత వారు నగలను పరీక్షించుకోలేదు. సంక్రాంతి పండుగ సందర్భంగా నగలను పరిశీలిస్తే అవి నకిలీవని తేలింది. బయటికి చెబితే పరువు పోతుందనే భావనతో ఉండిపోయారు. ఎట్టకేలకు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

దళిత విద్యార్థిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి


దళిత విద్యార్థిపై దాడికి నిరసన తెలుపుతున్న దళిత సంఘం నాయకులు

ఓబులవారిపల్లె : తిరుపతి విద్యానికేతన్‌లో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న జేమ్స్ అనే దళిత విద్యార్థిపై అగ్రవర్ణాల విద్యార్థులు సాయి, రూపేష్‌లు దాడి చేయడం అమానుషమని అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోలంరెడ్డి మల్లికార్జున అన్నారు. ఆదివారం చిన్నఓరంపాడులో విలేకరులతో మాట్లాడుతూ అగ్రవర్ణాల వారు జేమ్స్‌పై విచక్షణా రహితంగా దాడిచేసి కట్టేసి కొట్టి మూత్రం పోసిన దారుణమైన ఘటనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని కోరారు. దళిత విద్యార్థికి న్యాయం జరగని పక్షంలో తిరుపతి ఎస్పీ కార్యాలయం ఎదుట సోమవారం నుంచి ధర్నా చేస్తామన్నారు. ఈ సమావేశంలో భారత బహుజన రాష్ట్ర నాయకుడు కె. లక్ష్మీనారాయణ, ఎం.శ్రీను, దళిత నాయకుడు మన్యం బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నేడు గోపవరం ఉపసర్పంచ్ ఎన్నిక

ప్రొద్దుటూరు క్రైం : గోపవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక సోమవారం నిర్వహించనున్నారు. ఎన్నిక సందర్భంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మార్చి నెలలో రెండు సార్లు ఎన్నికను నిర్వహించడానికి జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేయగా వివిధ కారణాలతో ఈ ఎన్నిక వాయిదా పడిన విషయం తెలిసిందే.

గుండెపోటు నాటకంతో ఎన్నిక వాయిదా..

రెండో రోజు కూడా సేమ్ సీన్ రిపీట్ అయింది. అధికార పార్టీ నేతల వ్యూహ రచనలో భాగంగా రెండోసారి ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడింది. 28న ఉప ఎన్నిక సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడంచెల భద్రతను ఏర్పాటు చేసి కొర్రపాడు రోడ్డును పూర్తిగా మూసేశారు. భగత్‌సింగ్‌కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీల్లోని దుకాణాలను మూశారు. పోలింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్లు ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లారు. ఎన్నికను వాయిదా వేయాలనే దురుద్దేశంతో అధికార పార్టీ నేతలు పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లి వారికి వారే గొడవకు దిగారు. అక్కడి మినిట్స్ బుక్‌ను చించేశారు. పూర్తి స్థాయిలో కోరం ఉన్నా సదరు ఎన్నికల అధికారి ఎన్నిక నిర్వహించలేదు. కొద్ది సేపటి తర్వాత గుండె నొప్పిగా ఉందని ఎన్నికల అధికారి రామాంజనేయరెడ్డి చెప్పడంతో ఉప సర్పంచ్ ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

- సోమవారం గోపవరం ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంలో జరిగిన దౌర్జన్యాలు, హింసాత్మక ఘటనలను దృష్టిలో ఉంచుకొని డీఎస్పీ భావన ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఎస్పీ, డీఎస్పీని కలిసిన వార్డు మెంబర్లు

ప్రొద్దుటూరు : హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ గోపవరం గ్రామ పంచాయతీకి చెందిన 13 మంది వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు ఆదివారం జిల్లా ఎస్పీ, ప్రొద్దుటూరు డీఎస్పీని కలిశారు. ఈ మేరకు కోర్టు ఉత్తర్వుల ప్రతులను ఆయా కార్యాలయాల్లో అందజేశారు. గోపవరం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక సోమవారం ఉదయం జరగనుంది. గతంలో అరాచకాలకు, విధ్వంసాలకు పాల్పడిన టీడీపీ నేతల కారణంగా ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడింది. తమకు రక్షణ కల్పించి ఉప సర్పంచ్ ఎన్నికను ప్రజాస్వామ్యబద్ధంగా జరిగేలా చూడాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ రోస్టర్ పాయింట్ల లోపాలను సరిదిద్దాలి


సమావేశంలో మాట్లాడుతున్న పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ

కడప రూరల్ : ఎస్సీ వర్గీకరణ అంశానికి సంబంధించి రోస్టర్ పాయింట్ల లోపాలను సరిదిద్దాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ కోరారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో చట్టం చేసేలోపు ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన రోస్టర్ పాయింట్ల లోపాలను సరిదిద్ది మాల, మాదిగ వర్గాలకు న్యాయం చేయాలన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ అంశానికి సంబంధించి సమన్యాయం చేస్తున్నారని తెలిపారు. అలాగే ఎస్సీ సబ్ ప్లాన్ నిధులలో ఏబీసీడీ వర్గీకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి ఎల్లయ్య, ఏపీ ఎమ్మార్పీఎస్ తెలుగు రాష్ట్రాల కార్యదర్శి గొడుగునూరు మునెయ్య, తప్పెట హరిబాబు, మాతంగి సుబ్బరాయుడు, తప్పెట శివ, వెంకటసుబ్బయ్య, కొన్నెపల్లె మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్ విజయ తిరంగాయాత్ర

రామసముద్రం : మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో ఆపరేషన్ సింధూర్ విజయతిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చెంబకూరు రోడ్డులో ర్యాలీ చేశారు. సాయుధ బలగాలకు తామంతా అండగా ఉంటామని నినాదాలు చేశారు. జాతీయ భద్రత కోసం ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, మండల అధ్యక్షుడు ఇంజం ఆనంద్‌కుమార్, మదనపల్లె రూరల్ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, జనరల్ సెక్రటరీ సుబ్రమణ్యం, నవీన్, పవన్, బీజెవైఎం నెల్లూరు జిల్లా ఇన్‌చార్జ్ శ్రీనివాసమోదీ తదితరులు పాల్గొన్నారు.


బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట : పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ ఆదివారం బి.కొత్తకోటలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు హాజరై పట్టణంలో జాతీయజెండాలను చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ముఖ్య రహదారుల్లో ర్యాలీ జరిపారు. జ్యోతిచౌక్‌లో నినాదాలు చేశారు. ఉగ్రమూకలను తుదముట్టించేందుకు సైన్యం జరిపిన ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా నిర్వహించిన సైన్యానికి సెల్యూట్ చేస్తూ జై జవాన్ అంటూ నినదించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కుడుం శ్రీనివాసులు, కనకంటి ప్రసాద్, కురవ ప్రకాష్, గోరంట్ల రమేష్, శీలం రంగా, దుమ్ముచిన్నా, ముకుంద, బంగారు వెంకటరమణ, పాగొండ సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం


వరుడితో పి.రవీంద్రనాథ్‌రెడ్డి, తదితరులు

కడప కార్పొరేషన్: కడప–రాయచోటి రోడ్డులోని కడప కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం జరిగిన సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్ రఫీ కుమార్తె వివాహ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డితో పాటు చిత్తూరు ఉమ్మడి జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, రాయచోటి మాజీ శాసనసభ్యుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గడికోట శ్రీకాంత్ రెడ్డి, కడప డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగంలున్నారు. వీరితో పాటు వైఎస్సార్‌సీపీ నేత సుభాన్ బాషా, వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్, జమాల్ వలి, దాసరి శివ, కార్పొరేటర్లు పాకా సురేష్, బాలస్వామి రెడ్డి. చాక్లెట్ గౌస్, షఫీ, ఆరిఫ్, డివిజన్ ఇంచార్జ్ మున్నా తదితరులు వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



క్లుప్తంగా

గుర్రంకొండ ఎస్‌ఐగా రఘురామ్



గుర్రంకొండ: గుర్రంకొండ ఎస్‌ఐగా కె. రఘురామ్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేస్తున్న మధురామచంద్రుడు రాయచోటి డీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చిట్వేల్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహిస్తున్న రఘురామ్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

అశ్వవాహనంపై ఏనుగుమల్లమ్మ



బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై వెలసిన ఏనుగుమల్లమ్మ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. సుప్రభాతపూజ, మంగళవాయిద్యాలతో గణపతిపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, ఆఖండదీపారాధన, ధ్వజస్తంభ పూజ, అభిషేకాలతో కుంకుమార్చన, మహా మంగళహారతి జరిపారు. సాయంత్రం ఏనుగు మల్లమ్మ ఉత్సవ విగ్రహాన్ని అశ్వ వాహనంలో ఊరేగించారు. కాండ్లమడుగుకు చెందిన ధరణి, విజయకుమార్‌రెడ్డి దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె సిటీ: స్థానిక ఈశ్వరమ్మకాలనీలోని నోబుల్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో ఆదివారం ఎయిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు అబ్జల్‌బాషా,సుబహాని, హసీనా పర్వీన్, అరీఫుల్లా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు 150 మందికిపైగా పరీక్షలు నిర్వహించారు. రియాజుార్ రహమాన్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు మృతి

మదనపల్లె సిటీ: పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు, వాసవీ ట్రస్టు చైర్మన్ మాకం అశోక్ కుమార్(75) ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. తమిళనాడు కంచి వెళ్లి తిరుగు ప్రయాణంలో అస్వస్థతకు గురయ్యాడు.ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ప్రాణరక్షణ కోసం హెల్మెట్లు వాడాలి

తంబళ్లపల్లె: వాహనాలు నడిపేవారు ప్రాణరక్షణ కోసం తప్పకుండా హెల్మెట్ వాడాలని ఏఎస్‌ఐ నజీర్‌బాషా తెలిపారు. ఆదివారం మదనపల్లె-తంబళ్లపల్లె రహదారిలో వాహనాలు తనిఖీ నిర్వహించారు. వాహనచోదకుల రికార్డులు పరిశీలించారు. కొందరికి ఫైన్ విధించారు. అందరికి కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వకూడదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పోలీసులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీస్సులు

మదనపల్లె రూరల్ : మండలంలోని మొలకలదిన్నె బీడీఎస్ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగిన షేక్ ఫకీర్‌షా వలీ కుమార్తె వివాహ వేడుకకు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ హాజరయ్యారు. వధూవరులు సమీరా సుల్తానా, ఎస్.ఎం.అయూబ్‌పాషాలను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, మామిడి నిసార్, అర్షద్, మదార్, ఆడిటర్ మున్నా, నన్నేసాబ్, యూనస్, మల్లికార్జున, కుమార్, కమల్, హిదాయత్, ఇబ్రహీం, బుల్లెట్‌షఫీ, ఎం.చంద్రమోహన్, సాదిక్, యాసీన్, నాసీర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ భక్తులపై లాఠీచార్జ్ తగదు

మదనపల్లె రూరల్ : హనుమాన్ శోభాయాత్రలో శ్రద్ధాభక్తులతో పాల్గొన్న భక్తులపై పోలీసులు లాఠీచార్జ్ జరిపి, కార్యక్రమం జరగనీయకుండా అడుగడునా ఆంక్షలు, అడ్డంకులు సృష్టించడం తగదని విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహన్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...హనుమాన్ శోభాయాత్ర ప్రారంభం నుంచే పోలీసులు కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. శాంతియుతంగా సాగుతున్న ర్యాలీని పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. హనుమాన్ మాలధారణలోని భక్తులను అసభ్య పదజాలంతో దూషించడం, లాఠీచార్జ్ చేయడంతో పాటు అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. దీనిని హిందువుల మనోభావాలపై జరిగిన దాడిగా విశ్వహిందూ పరిషత్ భావిస్తోందన్నారు. ఇలాంటి పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీస్‌యంత్రాంగం బాధ్యతగా వ్యవహరించాలని కోరారు.

వైభవంగా నల్లవీరగంగాభవాని ఊరేగింపు



జలాభిషేకానికి ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

కలికిరి(వాల్మీకిపురం): పట్టణ పరిధిలో వెలసిన వాల్మీకిపురం గ్రామదేవత శ్రీనల్లవీర గంగాభవాని జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం వైభవంగా అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. జాతర ఉత్సవ నిర్వహణకు వాల్మీకిపురం పట్టణానికి చెందిన మొర్రంరెడ్డి భరత్‌కుమార్ రెడ్డి రూ.90 వేలువితరణ చేసి అమ్మవారిపై భక్తిని చాటుకున్నారు. జాతర ఉత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ పండితులు జనార్ధన్ స్వామి అమ్మవాని మేల్కొలిపి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, విశేష పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం 108 మంది మహిళలు 108 కుండలతో జలాలను ఆలయం వద్ద నుంచి సీతారామ్ టాకీస్, కొత్తపేట వీధి, గాంధీ బస్టాండ్, ఎల్ఆర్ వీధి, పట్టాభిరామాలయం, బజారు వీధి, నాయక్ వీధి, హరి మందిర మీదుగా సంప్రదాయ మంగళవాయిద్యాల నడమ ఊరేగింపుగా వెళ్లి జలాభిషేకం చేశారు. పట్టణంలోని మహిళలతో గొల్లపల్లి, ఇతర ప్రాంతాలకు చెందిన మహిళలు అమ్మవారికి దీలు బోనాలు సమర్పించడానికి ఊరేగింపులా ఆలయానికి చేరుకోవడంలో భక్తులతో ఆలయం కిక్కిరిసింది. ఆలయం వద్ద ఎం.సుకుమార్‌రెడ్డి, మాకం సుకుమార్‌లకు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక అలంకరించి పుష్పపల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త మొర్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి, టి.ఆనందశెట్టి, వి.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు చూపిన శాంతిమార్గంలో నడవాలి

–చిప్పిలి చర్చిలో నిసార్‌అహ్మద్ ప్రార్థనలు



చిప్పిలి బిలీవర్స్ చర్చిలో పాస్టర్ ఆశీర్వాదం అందుకుంటున్న నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్ : ఏసుక్రీస్తు చూపిన శాంతిమార్గంలో అందరూ నడవాలని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. ఆదివారం మండలంలోని చిప్పిలి బిలీవర్స్ ఈస్టన్ చర్చిలో జరుగుతున్న ప్రత్యేక ప్రార్థనల్లో..పాస్టర్ సుధాకర్ ఆహ్వానం మేరకు నిసార్‌అహ్మద్ పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం ఆయన క్రైస్తవులను ఉద్దేశించి మాట్లాడుతూ..ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి శాంతి చూపే దారులని కీర్తించారు. ప్రజలందరిపై ప్రభువు దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఏడాదిక్రితం ఉన్న పరిస్థితులు నేడు లేవని, అన్ని పథకాలు ఇంటివద్దకే అందే పరిస్థితి నాడు ఉండేదన్నారు. తేడాను ప్రజలే గమనించాలన్నారు. ఏసుక్రీస్తు ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పిస్తే ప్రజాసేవలో తరించాలన్నదే తన ఆశయమని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్, రిచర్డ్ చంద్ర, తంబు, మయూర్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మునిశేఖర్, నర్సింహులు, నూర్, ఈశ్వర్‌నాయక్, కొత్తపల్లె మహేష్, శారదా రెడ్డి, నాగమణి, శంకర్‌నాయక్, మల్లికార్జునరెడ్డి, చరణ్, క్రైస్తవులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై దాడి దుర్మార్గపు చర్య

పెద్దతిప్పసముద్రం: తిరుపతిలో బీటెక్ చదువుతున్న విద్యార్థి జేమ్స్‌ను అగ్ర కులాలకు చెందిన జూనియర్ విద్యార్థులు దాడి చేయడం దుర్మార్గపు చర్య అని నేషనల్ హెల్ప్‌లైన్ అగెనిస్ట్ అట్రాసిటి (ఎన్‌హెచ్‌ఏఏ) ఫీల్డ్ లెవల్ కౌన్సిలర్ కేవీ రమణ ఆరోపించారు. మండలంలోని పోతుపేటకు చెందిన కేవీ రమణ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ దళిత విద్యార్థిపై దాడి చేయడమే గాక కిడ్నాప్ చేసి రెండు రోజుల పాటు చిత్ర హింసలు పెట్టారన్నారు. వీరికి సహకరించిన పెద్దలు, నాయకులపైన తక్షణం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, యత్నాయత్నం కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేసారు. పోలీసుల ధోరణి చూస్తుంటే ఈ ఘటనలో అధికార పార్టీ నాయకుల పిల్లలు ఉన్నారని, కేసును నీరుగార్చేలా ప్రయత్నాలు చేస్తున్నారనే అనుమానాలు తేటతెల్లమవుతోందన్నారు. దళిత ఆడపడచుగా ఉన్న రాష్ట్ర హోం మంత్రి ఈ ఘటనపై స్పందించి బాధిత దళిత విద్యార్థి జేమ్స్‌కు అండగా నిలచి ఈ దుశ్చర్యపై సమగ్రమైన విచారణ చేపట్టి ఇందుకు కారకులైన నిందితులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పిఠాపురం, నెల్లూరు జిల్లాల్లో ఇటీవల జరిగిన ఎస్సీ కులాల బహిష్కరణలు, వెలివేతలపై కూడా హోం మంత్రితో పాటు డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్‌లు స్పందించి బాధితులకు అండగా నిలబడి దౌర్జన్యకారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీ రమణ కోరారు.

హెచ్‌ఐవీ బాధితులపై వివక్ష తగదు



కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న దృశ్యం

మదనపల్లె సిటీ: హెచ్‌ఐవితో జీవిస్తున్న వారి పట్ల వివక్ష తగదని,వారి పట్ల ప్రేమ, ఆదరణ కలిగి ఉండాలని మదనపల్లె జిల్లా ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ మేఘన, హుమయూన్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా ఆస్పత్రిలో అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించారు. హెచ్‌ఐవి మృతుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జయకుమార్, పురుషోత్తం, పుల్లయ్య, ఆర్ఆర్ఎస్ పీఓ పురుషోత్తం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ మృతుల ఆత్మశాంతి కోసం కొవ్వొత్తులతో నివాళులు

తంబళ్లపల్లె: హెచ్‌ఐవీ మృతుల ఆత్మశాంతి కోసం ఆదివారం స్థానిక సీహెచ్‌సీలో అంతర్జాతీయ ఎయిడ్స్ కొవ్వొత్తుల స్మారక దినం పురస్కరించుకుని కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. హెచ్‌ఐవి బాధితుల పట్ల ప్రేమ, సంఘీభావం కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజ అన్నారు. హెచ్‌ఐవీ మృతుల ఆత్మశాంతి కోసం మౌనం పాటించారు. అనంతరం ర్యాలీ మౌనంగా ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ లోగో చుట్టూ క్యాండిల్స్ పెట్టారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ చంద్రమోహన్, ఎ ల్‌టీ బాలాజీ, కృషి సంస్థ ప్రతినిధులు సావిత్రి, చంద్రనాగమ్మ, నాగరాణి, రేఖ వసంత, క్రిష్ణవేణి, గాయిత్రి, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ శిఖరాభిషేకం



పూజలు చేస్తున్న వేదపండితులు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎం క్రాస్‌రోడ్డు పంచాయతీ ఇందిరమ్మకాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామస్వామి ఆలయ శిఖరాభిషేకం ఆదివారం వైభవంగా జరిగింది. అర్చకులు రవిచంద్ర, ప్రవీణ్‌స్వామిలు నదీజలాలలతో కలశ స్థాపన చేసి స్వామి, అమ్మవార్లకు ఆలయ శిఖరంకు అభిషేకం నిర్వహించారు. గణపతి,సుదర్శన,వాస్తు హోమాలు చేశారు. రామకోటి, భజనలు, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గ్రామ సర్పంచు బండపల్లి ఈశ్వరమ్మ, ఏపిడబ్ల్యుజె రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బండపల్లి అక్కులప్ప, హనుమంతరెడ్డి, రామచంద్రరాజు, సోమశేఖర్, ఈశ్వర్, యుగంధర్, రాఘవ, గుణవతి, రమాదేవి, కిరణకుమారి, మంజుల, భార్గవి, విజయ,రెడ్డిలక్ష్మి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెడ్డెమ్మ తల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ఎదుట వరపడ్డారు.మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు.

గిరిజన సంక్షేమం కోసం కృషి

మదనపల్లె సిటీ: గిరిజన సంక్షేమం కోసం కృషి చేస్తానని గిరిజ సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు పి.బొజ్జప్ప అన్నారు. ఆదివారం స్థానిక ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ పాఠశాలలో మదనపల్లె డివిజన్ గిరిజన సంక్షేమ సేవా సంఘ మహిళా అధ్యక్షురాలిగా పూల మంగమ్మను ఎన్నుకున్నారు. అలాగే సేవా సంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందరికి అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. పేద, నిరుపేద గిరిజన కుటుంబాలకు భరోసా కల్పిస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పోల వేమనారాయణ, జిల్లా అధ్యక్షులు హరిశివప్ప తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



ర్యాలీని ప్రారంభిస్తున్న బీటీ కాలేజీ కరస్పాండెంట్ వైఎస్ మునిరత్నం

మదనపల్లె సిటీ: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బీటీ కాలేజీ కరస్పాండెంట్ వై.ఎస్.మునిరత్నం అన్నారు. ఆదివారం హాకీ సమ్మర్ కోచింగ్ క్రీడాకారులు 4 కె రన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థి దశ నుంచి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. క్రీడల్లో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయన్నారు. హాకీ కోచింగ్‌కు వస్తున్న క్రీడాకారులు మెళుకవలు నేర్చుకుని క్రీడలో రాణించాలన్నారు. ఇదే స్ఫూర్తితో ఆడాలన్నారు. ర్యాలీ కృష్ణదేవ రాయ సర్కిల్, బెంగళూరు బస్టాండు, సిటీఎం రోడ్డు వరకు సాగింది. కార్యక్రమంలో కోచ్‌లు ప్రసాద్‌రెడ్డి, నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

కనుమలో గంగమ్మా..కరుణించమ్మా



కనుమలో గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న జింకాచలపతి, 11వవార్డు మహిళలు

మదనపల్లె రూరల్ : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి..కనుమలో గంగమ్మా..కురుణించమ్మా అంటూ 11వవార్డుకు చెందిన ప్రజలు అమ్మవారిని వేడుకున్నారు.మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతితో కలిసి దీలు, బోనాలతో అమ్మకు, ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జింకా చలపతి మాట్లాడుతూ...ప్రతి ఏటా వేసవిలో 11వవార్డు ప్రజలు అందరూ కలిసి అమ్మవారికి దీలు, బోనాలు మోసి మొక్కులు చెల్లించుకుని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించామన్నారు. కార్యక్రమంలో కిట్టు, ఆంజనేయులు, సూరి, చిన్న ఆంజనేయులు, నారాయణ, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

భక్తులతో గర్నిమిట్ట యల్లమ్మ ఆలయం కిటకిట



యల్లమ్మతల్లికి బోనాలు తీసుకువస్తున్న చింతమాకులపల్లె నాయునివారు

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో వెలసిన గ్రామ దేవత యల్లమ్మ ఆలయంలో ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. యల్లమ్మ అమ్మవారి జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి విశేషాలంకరణ గావించి పుష్పపల్లకిలో ఉంచి గ్రామంలో మంగళ వాయిద్యాల మధ్య ఘనంగా ఊరేగించారు. అనంతరం మండలంలోని చింతమాకులపల్లెకు చెందిన నాయునివారు మొదట అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నాయునివారు తొలి బోనం సమర్పించిన అనంతరమే మిగిలిన వారందరూ బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఆదివారం సాయంత్రం గర్నిమిట్టతోపాటు కేవీపల్లె, చింతమాకులపల్లె పరిసర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున బోణాలు ఊరేగింపుగా తీసువచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా శ్రీపోలేరమ్మ తిరునాల



అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ

గుర్రంకొండ: మండలకేంద్ర మైన గుర్రంకొండ మేజర్ పంచాయతీ గ్రామదేవత పోలేరమ్మ తిరునాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గత శనివారం రాత్రి తిరునాల సందర్భంగా పంచాయతీ పరిధిలోని సుంకరవాండ్లపల్లె, దౌలత్‌ఖాన్‌పల్లె గ్రామస్తులు అమ్మవారికి బోనాలు, దీటీలు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. రాత్రి ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన బెంగళూరుకు చెందిన కళాకారుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టు కొన్నాయి. రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించిన చాందినీ బండ్లు అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగాయి. బండ్ల ముందు జానపద నృత్యాలు, సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆదివారం పగలు తిరునాల సందర్భంగా అమ్మవారి ఆలయం పరిసరాల్లో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున గ్రామస్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. మహిళలు చీరెసారెలను అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకొన్నారు.